# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-04-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు జన్మదినం సందర్భంగా ఈరోజు రాష్ట్రంలోని అన్నక్యాంటీన్‌లలో ఉచితంగా ఆహారాన్ని అందిస్తారు.

2. రైతుభరోసా పథకం కింద రెండో విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ రోజు విడుదల చేస్తారు.

3. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రాధాన్యతనిస్తోందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి పేర్కొన్నారు.

4. మహిళా సాధికారత లక్ష్యంగా కేంద్రం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అన్నారు.

5. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి తెలిపారు.

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు ఈ రోజు విజయవాడ నగరంలోని పటమట అన్నక్యాంటీన్‌లో అల్పాహారం తీసుకోనున్నారు. ఈరోజు ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా ఆయన సతీమని నారా భువనేశ్వరి అన్న క్యాంటీన్‌ల ఒక రోజు ఖర్చు 76 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఈ విరాళం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో ఉచితంగా ఆహారం అందించనున్నారు. ఇందులో భాగంగా స్వయంగా ముఖ్యమంత్రి తన పుట్టిన రోజు సందర్భంగా ఆయన సతీమణి భువనేశ్వరితో కలిసి పటమటలోని అన్నక్యాంటీన్‌లో అల్పాహారం తీసుకోనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు అన్ని అన్న క్యాంటీన్లలో అన్నదాన కార్యక్రమం జరుగుతుంది.

--------------------------

రైతుభరోసా పథకం కింద రెండో విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈరోజు విడుదల చేస్తారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లిలో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రితో పాటు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రుల సమక్షంలో నిధులను విడుదల చేస్తారు. తాజాగా రెండో విడత కింద 45 లక్షల 11 వేల 947 మంది రైతులకు 2 వేల 206.06 కోట్ల రూపాయలను

కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు వేదికలలో ప్రభుత్వం ప్రత్యక్ష ప్రసారం చేయనుందని తెలిపారు. అనంతరం కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ బ్యారేజీని ముఖ్యమంత్రి పరిశీలిస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రాధాన్యతనిస్తోందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బాపట్ల జిల్లాలోని వేటపాలెం మండలం రామాపురం సముద్ర తీరంలో నూతనంగా ఏర్పాటు చేసిన పారామోటర్ ఎయిర్ సఫారిని జిల్లా ఇంచార్జి మంత్రిగా నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగంతోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యమన్నారు. పర్యాటకులను మరింతగా ఆకర్షించే విధంగా జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సి ఉందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

అక్షయ తృతీయను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ లోని సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి చందనోత్సవం ఈ తెల్లవారుజాము నుంచి ఘనంగా ప్రారంభమైంది. వేకువజామున 3 గంటలకు ఆలయ అనువంశిక ధర్మకర్తల దర్శనంతో ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. ప్రత్యేక పూజలు అనంతరం స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతిస్తున్నారు. ఏడాది పొడవునా చందన కవచంలో ఉండే స్వామివారు, ఈ రోజు మాత్రమే నిజరూపంలో దర్శనమిస్తారు. ఈ నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లలో మజ్జిగ, త్రాగునీరు వంటి ఏర్పాట్లను చేశామని అధికారులు తెలిపారు.

---------------------------

మహిళా సాధికారత లక్ష్యంగా కేంద్రం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ అన్నారు. అనంతపురంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, మహిళలకు ప్రాధాన్యతనిస్తూ ప్రవేశపెట్టిన మహిళా బిల్లును డీలిమిటేషన్ బిల్లును ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించడం సరికాదని పేర్కొంటూ పేర్కొంటూ....

వాయిస్.. 25.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా కొంతేరులో 9వ తరగతి విద్యార్థులకు 550 ఉచిత సైకిళ్లను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిన్న పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల బాల బాలికలకు కార్పోరేట్ సామాజిక బాధ్యత సిఎస్ఆర్ కింద పలు సంస్థల నుంచి ఉచిత సైకిళ్లకు నిధులను సమకూరుస్తున్నామన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా తమ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి అన్నారు.

---------------------------

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖ మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో ఎస్సీ,ఎస్టీ లబ్ధిదారులకు ఉచిత సోలార్ విద్యుత్ ఫలకాల అందజేత కార్యక్రమానికి మంత్రి నిన్న ప్రారంభోత్సవం చేశారు. అనంతరం బీసీ

జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా కోటి గృహాలకు ఉచిత విద్యుత్ అందించాలనే లక్ష్యంతో ఈ పథకం అమలు చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీతో సౌరఫలకాలను అందిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..25. సెకన్లు

---------------------------

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎన్డీయే ప్రభుత్వం బిల్లు ప్రవేశపెడితే ఇండియా కూటమి నాయకులు అడ్డుకొని తప్పుచేశారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. మహిళా రిజర్వేషన్, పునర్విభజన బిల్లులపై అసత్య ప్రచారం చేసి అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ మేరకు నిన్న ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ మహిళలతో పాటు దేశంలోని మహిళలను ఇండియా కూటమి అవమానించిందని అన్నారు. తెలంగాణలో ప్రతి గ్రామంలో ఈ బిల్లులపై అవగాహన కల్పనకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకత్వం సిద్ధమవుతుందని బండి సంజయ్ పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో మొక్కజొన్న పంటను భారత జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య – నాఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలనీ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు నిన్న లేఖ రాశారు. శనగ, పొద్దుతిరుగుడు పంటలపై ఉన్న 25 శాతం పరిమితిని ఎత్తివేసి పూర్తిగా కొనుగోలు చేయాలన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎండతీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలతో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, రాయలసీమ జిల్లాల్లో ఈరోజు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. అలాగే ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

మరోవైపు.. తెలంగాణలో ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================